

ఆర్టీసీకి కలిసొచ్చిన ఎన్నికలు
ఓటు హక్కు వినియోగానికి పలువురు స్వగ్రామాలకు తరలిరావడంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది.
8లో



అత్యధికం పాలేరు !
ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో అత్యధికంగా పాలేరులో 90.89 శాతం పోలింగ్ నమోదైంది.
8లో

గరిష్టం / కనిష్టం
32° / 20°

వాతావరణం
జిల్లాలో శనివారం మబ్బులు, ఎండలతో భిన్న వాతావరణం ఉండవచ్చు. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచ: మండలంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో శుక్రవారం అమ్మవారికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఈఓ రజినీ కుమారి ఆధ్వర్యంలో మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం పంచ హారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు గావించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు మాలోతు సువాలి, గంధం వెంగళరావు, కిలారు నాగ మల్లేశ్వరరావు, బేతంశెట్టి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు 'సీసీఐ' పాట్లు



అశ్వాపురం మండలం నెల్లిపాక సీసీఐ కేంద్రంలో విక్రయానికి తీసుకొచ్చిన పత్తి

అశ్వాపురం: జిల్లాలో అశ్వాపురం, బూర్గంపాడు, సుజాతనగర్ మండలాల్లో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. అయితే నిబంధనలతో రైతులు అవస్థలు పడుతున్నారు. గతంలో సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయిస్తే రైతులు ఇచ్చిన బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేసేవారు. ఈసారి రైతులు ఇచ్చిన ఆధార్‌కార్డు నంబర్‌కు లింకైన ఏదో ఒక బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తున్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లే రైతులకు జీరో అకౌంట్, పోస్టాఫీస్ ఖాతాలు కూడా ఉన్నాయి. ఈ ఖాతాల్లో రూ.లక్షకు మించి డబ్బు జమ కాకపోవడంతో పత్తి అమ్మిన రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. పంట విక్రయించాక 15 రోజులు గడిచినా డబ్బులు ఖాతాల్లో నగదు పడటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే దిగుబడిలేక పెట్టిన పెట్టుబడులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే కేంద్రాల్లో పత్తి నాణ్యత లేదని క్వింటాకు ఐదు కేజీల వరకు కోత విధిస్తున్నారని వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పత్తి రైతులు కోరుతున్నారు.

ఒకేరోజు రూ.31 కోట్ల మద్యం అమ్మకాలు

వైరా: నూతన మద్యం పాలసీ ఉమ్మడి జిల్లాలో వైన్స్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆయా వైన్స్‌లకు వైరాలోని మద్యం డిపో నుండి రూ. 31 కోట్ల విలువైన మద్యం తీసుకెళ్లారు. గత సెప్టెంబర్‌లో కొత్త వైన్స్‌కు డ్రా పూర్తిచేయగా, శుక్రవారం నుంచి మొదలయ్యాయి. ఈమేరకు వ్యాపారులు రూ. 31 కోట్ల మేర డీడీలు చెల్లించి మద్యాన్ని షాపుల్లోకి దిగుమతి చేసుకున్నారు. కాగా, మద్యం తరలింపు రాత్రి 11 గంటల వరకు కూడా కొనసాగింది.

అందరికీ కృతజ్ఞతలు

ఎంపీ నామ నాగేశ్వరరావు



ఖమ్మంమయూరిసెంటర్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు అండగా నిలిచి, మద్దతు తెలిపిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతోపాటు బీఆర్ఎస్ పక్షాన ఓట్లు వేసిన ప్రజలందరికీ బీఆర్ఎస్ లోక్ సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓట్లు వేసిన ప్రజలకు రుణపడి ఉంటామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఓపెన్ టెన్త్‌లో 11వరకు ప్రత్యేక ప్రవేశాలు

కొత్తగూడెం అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఈనెల 11వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ కింద ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

భవితవ్యం ఈవీఎంల్లో..

ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో గెలుపు గుబులు

- కొత్తగూడెంలో త్రిముఖ, మిగతా చోట్ల ద్విముఖ పోటీ
- ఈసారి ఎన్నికల్లో కనిపించిన కాంగ్రెస్ హవా
- చివర్లో భారీ పోలింగ్ తమకే అనుకూలం అంటున్న గులాబీ దళం
- సీపీఐకి క్రాస్ ఓటింగ్ గండం.. జలగం శిబిరంలో విశ్వాసం



గడిచిన రెండు నెలలుగా రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. చివరకు 95 మంది అభ్యర్థులు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల నుంచి బరిలో దిగారు. కొత్తగూడెంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన అభ్యర్థుల మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేటలలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పోటీ నెలకొంది. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు రెండు వారాలుగా అహర్నిశలు శ్రమించారు. పోలింగ్ ముగియడానికి గంట ముందు వరకు కూడా సర్వశక్తులు ఒడ్డారు. జిల్లావ్యాప్తంగా 79 శాతం పోలింగ్ నమోదు కాగా, అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఈ నెల 3న నిర్వహించే లెక్కింపులో విజేతలు ఎవరో తేలనుంది. ప్రధాన పార్టీ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు జరగడంతో గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నా.. ఏదో ఒక మూలన సందేహాలూ వెంటాడుతున్నాయి. **–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం**

సీపీఐకి క్రాస్ ఓటింగ్ భయం.. జలగం వర్గీయుల్లో అదే నమ్మకం

కొత్తగూడెం నియోజకవర్గంలో క్రాస్ ఓటింగ్‌పై చర్చ జరుగుతోంది. ఇక్కడ కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బరిలో ఉన్నారు. దశాబ్దాల తరబడి ఢీ అంటే ఢీ అన్నట్టుగా ఈ రెండు పార్టీలు పోరాటం చేశాయి. ఎన్నికల సమయంలో పైస్థాయిలో పొత్తులు కుదిరినా క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు సీపీఐకి ఎంత మేరకు మద్దతు ఇచ్చారనే అంశంపైనే ఇక్కడ గెలుపోటములు ఆధారపడి ఉన్నాయి. అయితే కంకికొడవలి గుర్తుకు ఓటేసే విషయంలో కాంగ్రెస్ శ్రేణులు ఎక్కడా వెనుకడుగు వేయలేదన్నట్టుగానే పోలింగ్ సరళి కొనసాగింది. కాంగ్రెస్ నేతలు సైతం సీపీఐ అభ్యర్థి గెలుపుపై బహిరంగంగా ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే హస్తం శ్రేణుల ఓట్లు భారీగా క్రాస్ అయ్యాయనే నమ్మకం జలగం వర్గీయుల్లో ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి పెద్ద ఎత్తున ఓట్లు సింహం గుర్తు వైపు మళ్లాయని, అవే తమ గెలుపునకు బాటలు వేస్తాయనే నమ్మకంతో జలగం వెంకటరావు శిబిరం ఉంది.

ఆఖరులో కారు జోరు ?

జిల్లాలో గురువారం జరిగిన పోలింగ్‌లో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో హస్తం హవా స్పష్టంగా కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఏకపక్షంగా గెలుపు తమదే అన్నట్టుగా ఆ పార్టీ నేతలు సైతం కనిపించారు. అయితే మధ్యాహ్నం ఒంటిగంట వరకు జిల్లా వ్యాప్తంగా జరిగిన మొత్తం పోలింగ్ కేవలం 40 శాతమే. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. దీంతో రాత్రి పది గంటల వరకు కూడా కొన్ని చోట్ల పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. ఫలితంగా జిల్లా మొత్తం పోలింగ్ శాతం 79 శాతంగా నమోదైంది. పోలింగ్ ముగియడానికి రెండు గంటల ముందు వచ్చిన ఓటర్లలో ఎక్కువ మంది తమ మద్దతుదారులనే అంచనాలో కారు పార్టీ నేతలు ఉన్నారు. ఉదయం వేళ జరిగిన పొరపాట్లను గుర్తించి వాటిని సరి చేసిన తర్వాత తమ పార్టీకి అండగా ఉన్న వర్గాలు, మద్దతుదారులు ఓటేశారని వారు అంటున్నారు. దీంతో ఉదయం కనిపించిన హస్తం హవా సాయంత్రానికి తగ్గిపోయిందనే నమ్మకం గులాబీ పార్టీ వర్గాలు కనబరుస్తున్నాయి. ముఖ్యంగా కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేటలో చివరి గంట జరిగిన పోలింగే అక్కడి ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గెలుపు నాదే

గత ఎన్నికలతో పోల్చితే ఈసారి ఓటింగ్ శాతం తగ్గింది. ప్రభుత్వ వ్యతిరేకత బలంగా ఉంటే ఓటింగ్ శాతం పెరుగుతుందనే వాదనను తెర మీదకు తెస్తున్నారు. ఇల్లెందులో ఓటింగ్ పూర్తిగా తమకు అనుకూలంగా ఉందనే భావన కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య మద్దతుదారుల్లో ఉండగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తాను చేసిన అభివృద్ధికి నచ్చిన వాళ్లు హడావుడి లేకుండా తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చారనే నమ్మకంతో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ ఉన్నారు. పినపాకలో బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు, కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు మధ్యన నువ్వా – నేనా అనే స్థాయిలో పోటీ నెలకొంది. ఇక్కడ విజేత ఎవరన్నది ఈవీఎంలు ఓపెన్ చేస్తే తప్ప అంచనా వేయలేని పరిస్థితి ఉంది.

ముక్కోటికి ముస్తాబు..

- రామాలయంలో స్వాగతద్వారాలు, పెయింటింగ్ పనులు
- 13 నుంచి భద్రాచలంలో వైకుంఠ ప్రయుక్త అధ్యయనోత్సవాలు
- ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయానికి భక్తుల ఆదరణ



స్వాగత ద్వారాలకు పెయింటింగ్ వేస్తున్న కార్మికులు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దివ్యక్షేత్రంలో ముక్కోటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 13 నుంచి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలను నిర్వహించనున్నారు. 13 నుంచి జనవరి 2 వరకు అధ్యయనోత్సవాలు, జనవరి 3 నుంచి 5 వరకు విలాసోత్సవాలు జరపనున్నారు. జనవరి 8న సర్వదేవతా అలంకారమైన విశ్వరూప సేవ నిర్వహిస్తారు. అధ్యయనోత్సవాలలో భాగంగా ఈ నెల 13 నుంచి జరిగే పగల్ పత్తు ఉత్సవాల్లో స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. 22న గోదావరిలో హంస వాహనంపై తెప్పోత్సవం, 23న తెల్లవారుజామున వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు.

సాగుతున్న చలువ పందిళ్ల నిర్మాణం

రామాలయానికి రంగులు వేస్తూ సర్వాంగ సుందరంగా తయారు చేస్తున్నారు. ఆలయం చుట్టుపక్కలతో పాటు ప్రధాన గోపురం వద్ద పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్నారు. మిథిలా స్టేడియంలో స్వాగత ద్వారాల బోర్డులకు రంగులు వేస్తున్నారు. బ్రిడ్జి సెంటర్, పార్కు వద్ద, కరకట్ట దిగువన స్వాగత ద్వారాల ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఆలయంలోని అభయాంజనేయస్వామి ఉపాలయం చుట్టుపక్కల చలువ పందిళ్ల నిర్మాణం పూర్తయింది. చిత్రకూట మండపం ఎదురుగా, భక్తులు నడిచే దారుల్లో ఇతర పందిళ్ల నిర్మాణం జరుగుతోంది. మరో పది రోజుల్లో స్వామివారి అవతారాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. కొన్నేళ్లుగా ఆలయం, చుట్టుపక్కల లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. సుమారు రూ.80 లక్షలను ఏర్పాట్లకు ఖర్చు చేస్తుండగా, మరికొన్ని పనులు ప్రారంభం కావాల్సి ఉంది. తాత్కాలిక మరుగుదొడ్లు, వసతి ఏర్పాట్లు, డివైడర్లకు పెయింటింగ్, హంస వాహనం పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

వెబ్‌సైట్‌లో టికెట్లు..

ఉత్తర ద్వార దర్శనాన్ని వీక్షించేందుకు ప్రత్యేక సెక్టార్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. సెక్టార్లను విభజించి, రూ.2 వేలు, రూ. 1000, రూ. 500, రూ. 250 టికెట్లను దేవస్థానం వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. శుక్రవారం వరకు వీఐపీ సెక్టార్‌లో 700 టికెట్లకు గాను 203, రూ. వెయ్యి సెక్టార్‌లో 300 టికెట్లకు గాను 113, రూ.500కు సంబంధించి మూడు సెక్టార్ల టికెట్లు 950కు గాను 226, రూ. 250 సెక్టార్ టికెట్లు 500కు గాను 113 టికెట్లు అమ్ముడుపోయాయి. వీటితోపాటు దేవస్థానంలో జరిగే ఆర్జిత సేవలు, వసతి గదుల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తాం



భద్రాచలంలో ముక్కోటి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తాం. ముక్కోటి పనులకు సంబంధించి టెండర్లు పూర్తి కాగా వాటిలో కొన్ని నడుస్తుండగా, మరికొన్ని ప్రారంభం కావాల్సి ఉంది. హంస వాహనం పనులను పూర్తి చేసి ట్రయల్ రన్ నిర్వహణకు ఇతర శాఖ అధికారులతో ప్రణాళికలను రూపొందిస్తున్నాం.
–రమాదేవి, ఆలయ ఈఓ

ఎయిడ్స్ పట్ల అవగాహన ఉండాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంటౌన్: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎయిడ్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. బాధితులను చులకనగా చూడొద్దని చెప్పారు. అనంతరం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి చర్మవ్యాధుల డాక్టర్ మోహనకృష్ణారెడ్డి హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి నివారణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, జనరల్ సెక్రటరీ ఆర్.రామారావు, చీఫ్ లీగల్ ఎయిడ్ సర్వీసెస్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, న్యాయవాదులు లక్కినేని సురేందర్, మెండు రాజమల్లు, శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ జె.రమేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జ్యోతి విశ్వకర్మ, నాగస్రవంతి పాల్గొన్నారు.

నివారణే మార్గం

కొత్తగూడెంరూరల్: ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని, నివారణే మార్గమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శిరీష అన్నారు. కొత్తగూడెం తెలంగాణ గురుకుల డిగ్రీ బాలికల కళాశాలలో శుక్రవారం సెక్యూర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కలుషితమైన సిరంజి సూదుల వల్ల, పరీక్షలు చేయకుండా రక్త మార్పిడి చేయడం వల్ల, లైంగిక సంబంధాల వల్ల ఎయిడ్స్ వ్యాపిస్తుందని తెలిపారు. ఎవరికైనా అనుమానం ఉంటే సమీపంలోని ఐటీసీ కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలన్నారు. అవగహన కోసం టోల్ ఫ్రీ నంబర్ 1097 సంప్రదించాలని కోరారు. అధికారులు మోహన్, సత్యకుమార్, రామకృష్ణ, సెక్యూర్ ఎన్జీవో రాజేంద్రప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఫైజ్ మోహియిద్దీన్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

భద్రగిరిలో 'కార్తీక' సందడి

అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో 'కార్తీక' సందడి నెలకొంది. కార్తీక మాసం, వారాంతపు సెలవు దినాలు కావడంతో భక్తులు అధికసంఖ్యలో భద్రగిరికి తరలివస్తున్నారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని ఆర్జిత సేవల్లో పాల్గొంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీరామ పునర్వసు దీక్ష ప్రారంభం

కార్తీకమాసం పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయంలో శుక్రవారం శ్రీరామదీక్షను ప్రారంభించారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు విజయ రాఘవన్ మాలధారణ చేశారు. డిసెంబర్ 28న దీక్ష విరమణ ఉంటుంది. ఈ సందర్భంగా 28న గిరి ప్రదక్షిణ, పాదుకా పూజ, సాయంత్రం వెండి రథ సేవ, 29న పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

స్వర్ణ కవచధారణలో రామయ్య..

అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భారీ భద్రత నడుమ..

- ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచి సీల్ వేసిన అధికారులు
- పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం
- మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు
- రేపు ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు



అనుబోస్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్న అధికారులు



పహారా కాస్తున్న పోలీస్ సిబ్బంది



మీడియా కోసం ప్రత్యేక ప్రొజెక్టర్..



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేయిస్తున్న కలెక్టర్

పాల్వంచ: ఈవీఎంలను ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు గురువారం ముగియగా, జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం బ్యాలెట్ యూనిట్లను కౌంటింగ్ కేంద్రమైన పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలకు తరలించారు. శుక్రవారం తెల్లవారుజాము 5 గంటల వరకు అన్ని పోలింగ్ బూత్‌ల ఈవీఎంలు భద్రత నడుమ ఇక్కడికి చేరుకున్నాయి. అనంతరం వాటిని అధికారులు స్ట్రాంగ్ రూంల్లో భద్రపర్చారు. కళాశాల చుట్టూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సీఆర్‌పీఎఫ్, ఏఆర్, టీఎస్ఎస్‌పీ, పోలీస్ బలగాలను పెద్ద ఎత్తున మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈ నెల 3న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుండగా, సిబ్బంది 6 గంటలకే కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.

ఏర్పాట్లపై అధికారుల దృష్టి

అధికారులు కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ప్రత్యేక మెష్‌లు ఏర్పాటు చేశారు. వెలుతురు, సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సిబ్బంది వచ్చేందుకు ప్రత్యేకంగా బారికేడ్లు, వాహనాలకు పార్కింగ్, తాగునీరు, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం కోసం స్థలం కేటాయించి సదుపాయాలు కల్పిస్తున్నారు. మీడియా కవరేజీ బృందానికి ప్రత్యేక షామియానా వేసి, కౌంటింగ్ ఫలితాలను వీక్షించేందుకు ప్రొజెక్టర్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులు, పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కళాశాల బయట రోడ్డు పక్కన స్థలాన్ని చదును చేయించి వాహనాల పార్కింగ్ చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు సైతం భారీ ఎత్తున వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, కౌంటింగ్ కేంద్రానికి కొంత దూరంలో అల్లూరి సెంటర్ దాటి రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. కేంద్రం వద్ద అధికారులు గట్టి పర్యవేక్షణ చేపడుతున్నారు.

పోలైన ఓట్లు 7,75,113

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 9,66,439 మంది ఓటర్లు ఉండగా గురువారం జరిగిన పోలింగ్‌లో 7,75,113 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్ల 4,71,745 ఉండగా, 3,80,587 మంది ఓటేశారు. మహిళా ఓటర్లు 4,94,650 మంది ఉండగా, 3,94,501 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతరులు 44 మంది ఉండగా, 25 మంది ఓటేశారు. మొత్తం 80.20 శాతం ఓటింగ్ నమోదు కాగా, పురుషుల ఓటింగ్ 80.68 శాతం, మహిళల ఓటింగ్ 79.75 శాతం నమోదయింది.

ఈవీఎంలకు అత్యంత భద్రత : కలెక్టర్ ప్రియాంక ఆల



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

అత్యంత భద్రత నడుమ ఈవీఎంలను ఉంచామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. పట్టణంలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు కలెక్టర్, రిటర్నింగ్ అధికారుల సమక్షంలో దగ్గర ఉండి సీల్ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 1,098 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ స్వీకరించి, అనంతరం కౌంటింగ్ కేంద్రానికి తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ నెల 3న కౌంటింగ్ ప్రక్రియ జరగనుండగా, ప్రతీ నియోజక వర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని, పర్యవేక్షణకు 18 టీంలు ఉంటాయని, ప్రతి టేబుల్‌కు ఒక సూక్ష్మ పరిశీలకుడు, కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఓట్ల లెక్కింపు పరిశీలకులు కమల్ కిశోర్, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రతీక్ జైన్, రాంబాబు, కార్తీక్, శిరీష, మంగీలాల్, భీమ్లా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామయ్యకు పునర్వసు కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా శుక్రవారం మాస కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకొచ్చారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యోక్త్రధారణ, యజ్ఞోపవీత ధారణ తదితర పూజలు చేశారు. అనంతరం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శేషం కిరణ్‌కుమార్‌ఆచార్యులు, అమరవాది శ్రీకాంత్‌కృష్ణమాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ కిశోర్, ఇన్‌చార్జ్ ప్రసాద్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్


హితేష్ శ్రీరంగ


సాహిల్ ఫజల్

తల్లాడ: తల్లాడలోని బాలభారతి విద్యాలయం విద్యార్థులు టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ సాధించారు. ఖమ్మంలో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొన్న కోటగిరి హితేష్ శ్రీరంగకు 12వ ర్యాంక్, షేక్ సాహిల్ ఫజల్‌కు 14వ ర్యాంక్ వచ్చిందని విద్యాలయం కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్, కోచ్ సాంబమూర్తితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో తనిఖీ


హాస్టల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న జడ్జి భానుమతి

పాల్వంచ: పాల్వంచలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను పాల్వంచ బాలుర వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి జి.భానుమతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ఆరా తీశారు. వసతి గృహం తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్ రూంలను పరిశీలించారు. మరుగుదొడ్లు, వసతి గృహ ఆవరణ శుభ్రంగా లేక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కలిప్ంచాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


చికిత్స పొందుతున్న రాము, ఆయన భార్య విజయ

మణుగూరుటౌన్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలైన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని విప్పలసింగారం గ్రామానికి చెందిన మాడె రాము తన భార్య, పిల్లలతో కలిసి మర్కోడుకు ఏడూళ్లబయ్యారం మీదుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. రామానుజవరం వద్దకు చేరుకోగానే కారు వెనుక నుంచి ఢీకొనడంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోవడంతో స్థానికులు మధ్యలో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే, ఘటనపై ఎలాటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

పాల్వంచ: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాల్వంచ పట్టణ పరిధిలోని శేఖరం బంజరకు చెందిన బాదావత్ నవీన్(25) శుక్రవారం సాయంత్రం వ్యక్తి పురుగుల మందు తాగగా, బంధువులు గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, నవీన్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

అత్యధికం పాలేరు..!


చుంచుపల్లి తండా పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

పాలేరు ఫస్ట్
ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో అత్యధికంగా పాలేరులో 90.89 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత స్థానాల్లో మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, వైరా, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, కొత్తగూడెం ఉండగా.. చివరి స్థానంలో ఖమ్మం 71.43 శాతంతో నిలిచింది.

- 90.89 శాతంగా నమోదైన పోలింగ్
- ఆ తర్వాత మధిరలో 87.93 శాతం
- అత్యల్పంగా ఖమ్మంలో 71.43 శాతమే..

సాక్షి నెట్‌వర్క్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో చిన్నచిన్న ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. అయితే, చాలాచోట్ల రాత్రి పొద్దుపోవడం, అధికారులు ఈవీఎంలతో సహా జిల్లా కేంద్రాలకు చేరుకునే సరికి శుక్రవారం తెల్లవారింది. దీంతో గురువారం రాత్రి పోలింగ్ శాతాన్ని అధికారులు విడుదల చేసినా శుక్రవారం నాటి జాబితాతో పోలిస్తే స్వల్ప తేడాలు కనిపించాయి. ఇక నియోజకవర్గాల వారీగా పురుషులు, మహిళా ఓటర్లు.. ఇందులో ఓట్లు వేసి వారి గణాంకాలను కూడా అధికారులు వెల్లడించారు.

పురుషులదే అగ్రస్థానం

ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో కలిపి మహిళలు, పురుషులు, ఇతరుల సహా 21,83,235 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 10,60,910 మంది, మహిళలు 11,22,203 మంది, ఇతరులు 122 మంది ఉన్నట్లు అధికారిక జాబితా ద్వారా తెలుస్తోంది. మొత్తం ఓటర్లలో 17,95160 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 8,76,394 మంది, మహిళలు 9,18,701 మందితో పాటు ఇతరులు 65 ఉన్నారు. కాగా, మహిళా ఓటర్లు 11,22,203 మందిలో 9,18,701 మంది ఓటు వినియోగించుకోగా, పురుష ఓటర్లు 10,60,910 మందిలో 8,76,394 మంది ఓటు వేశారు. ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండగా.. ఓటు వినియోగంలో మాత్రం పురుషులే ముందంజలో ఉండడం విశేషం. మొత్తంగా పురుష ఓటర్లలో 1,84,516, మహిళా ఓటర్లలో 2,03,502 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇక ఇతరులు 122 మందికి గాను 65 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు...

	ఓటర్లు				ఓటు హక్కు వినియోగించుకున్న వారు				
నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
పాలేరు	1,14,134	1,22,148	5	2,36,287	1,04,402	1,10,366	2	2,14,770	90.89
మధిర	1,07,111	1,14,206	9	2,21,326	95,352	99,260	3	1,94,615	87.93
సత్తుపల్లి	1,18,885	1,24,225	8	2,43,118	1,03,937	1,08,606	6	2,12,549	87.43
అశ్వారావుపేట	76,193	79,761	7	1,55,961	66,560	68,937	4	1,35,501	86.88
వైరా	94,057	99,005	7	1,93,069	82,013	85,373	3	1,67,389	86.70
ఇల్లెందు	1,07,909	1,11,658	2	2,19,569	87,421	89,418	1	1,76,840	80.54
పినపాక	97,821	1,00,577	4	1,98,402	78,530	80,446	2	1,58,978	80.13
భద్రాచలం	71,437	77,220	4	1,48,661	56,769	60,675	3	1,17,447	79.00
కొత్తగూడెం	1,18,385	1,25,434	27	2,43,846	91,307	95,025	15	1,86,347	76.42
ఖమ్మం	1,54,978	1,67,969	49	3,22,996	1,10,103	1,20,595	26	2,30,724	71.43
మొత్తం	10,60,910	11,22,203	122	21,83,235	8,76,394	9,18,701	65	17,95,160	------

ఆర్టీసీకి కలిసొచ్చిన ఎన్నికలు

- స్వస్థలాలకు వచ్చేందుకు బస్సులనే ఎంచుకున్న ఓటర్లు
- 28, 29, 30వ తేదీల్లో అదనపు సర్వీసులు
- తిరుగు ప్రయాణంలోనూ బస్సులన్నీ కిటకిట
- మరో రెండు రోజులు కొనసాగనున్న రద్దీ


ప్రయాణికులతో రద్దీగా ఉన్న సత్తుపల్లి బస్టాండ్

సత్తుపల్లిటౌన్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారరీత్యా ఉంటున్న వారు కుటుంబాలతో సహా స్వస్థలాలకు వచ్చారు. వీరిలో సొంత వాహనాలు ఉన్న వారు మినహా ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులనే ఎంచుకున్నారు. దీంతో గత 29, 30వ తేదీల్లో బస్సులన్నీ కిటకిటలాడాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎక్కువ మంది హైదరాబాద్‌లో విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రీత్యా ఉంటున్నారు. వీరంతా ఓటు వేసేందుకు 29, 30వ తేదీల్లో స్వగ్రామాలకు వచ్చారు. ఆతర్వాత గురు, శుక్రవారాలలో తిరిగి పయనమయ్యారు. ఇక మరికొందరు శుక్ర, శనివారం కూడా స్వస్థలాల్లోనే ఉండి ఆదివారం తిరుగు పయనం కానున్నారు.

అదనపు సర్వీసులు

హైదరాబాద్ నుంచి స్వస్థలాలకు వచ్చేందుకు ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులనే ఎంచుకున్నారు. ఈమేరకు ముందుగానే రిజర్వేషన్ చేసుకున్నారు. దీంతో ఏ బస్సుల్లో కూడా సీట్లు ఖాళీ లేకపోవడాన్ని గుర్తించిన ఆర్టీసీ అధికారులు అదనపు సర్వీసులు నడిపించారు. ఇందులో భాగంగా 28వ తేదీన ఐదు, 29వ తేదీన 11 అదనపు సర్వీసులతో పాటు 30వ తేదీ రాత్రి హైదరాబాద్‌కు సత్తుపల్లి నుంచి తొమ్మిది రెగ్యులర్ సర్వీసులకు తోడు 13 అదనపు సర్వీసులు నడిపారు. అలాగే, శుక్రవారం కూడా నాలుగు అదనపు సర్వీసులు నడిపించాల్సి వచ్చింది. ఇక తిరుగు ప్రయాణం అయ్యే వారితో 3వ తేదీ ఆదివారం రద్దీ ఉండే అవకాశముండడంతో అదనంగా తొమ్మిది సర్వీసులు నడిపించనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఇదే పరిస్థితి ఖమ్మం రీజియన్‌లోని అన్ని డిపోల్లో కనిపిస్తోంది. గత 30వ తేదీన ఖమ్మం డిపో అత్యధికంగా 90 శాతం ఓఆర్ సాధించగా మణుగూరు 86 శాతం ఓఆర్ సాధించాయని అధికారులు వెల్లడించారు. కాగా, నవంబర్ నెలలో సత్తుపల్లి ఆర్టీసీ డిపో రూ. 5.03 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడం విశేషం.

రద్దీకి అనుగుణంగా బస్సులు



ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ఓటు వేసేందుకు వచ్చిన వారంతా తిరిగి వెళ్లే సమయాన ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈనెల 3వ తేదీన ఎక్కువ రద్దీ ఉంటుందనే భావనతో అదనపు సర్వీసులు సిద్ధం చేశాం. సురక్షిత ప్రయాణానికి అందరూ ఆర్టీసీ బస్సులను ఎంచుకోవాలి.
– యూ.రాజ్యలక్ష్మి, డిపో మేనేజర్, సత్తుపల్లి

ఎన్నికల వేళ కళకళ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలకు ఓట్లు వేసేందుకు వచ్చిన వారు శని, ఆదివారాల్లో తిరుగు ప్రయాణమయ్యే అవకాశముంది. దీంతో ఖమ్మం రీజియన్ నుంచి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసేందుకు ఆర్టీసీ అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు డిపోల ద్వారా రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించేందుకు సిద్ధమయ్యారు. ఇక ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉద్యోగులను నియోజకవర్గ కేంద్రాల నుంచి పోలింగ్ స్టేషన్లకు చేరవేసేందుకు కూడా యంత్రాంగం ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంది. అలాగే, ఈవీఎంలను తరలించేందుకు ఆర్టీసీ కార్గో వాహనాలను వినియోగించారు. ఇలా కూడా ఆర్టీసీకి ఆదాయం సమకూరినట్లయింది.

డిపోల వారీగా ఆదాయం (రూ.ల్లో)

డిపో	29వ తేదీ	30వ తేదీ
ఖమ్మం	28,10,295	26,37,374
మధిర	11,77,758	10,71,723
సత్తుపల్లి	18,04,311	19,31,486
భద్రాచలం	19,92,388	20,13,359
కొత్తగూడెం	12,75,555	10,07,864
మణుగూరు	15,81,482	15,24,477
ఇల్లెందు	2,84,571	1,98,920

నేటి నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలు

- మావోయిస్టుల పిలుపుతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం
- సరిహద్దుకు చేరుకుంటున్న ప్రత్యేక బలగాలు
- తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భారీ భద్రత


కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు (ఫైల్)

చర్ల: దండకారణ్యంలో యుద్ధమేఘాలు అలుముకున్నాయి. ఈ నెల 2వ తేదీన శనివారం నుంచి 8వ తేదీన వరకు పీఎల్‌జీఏ 23వ వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యాన పోలీసుశాఖ అప్రమత్తమైంది. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ శివారు చర్ల మండలంలో మావోయిస్టులు ఒక చోట లారీని దగ్ధం చేయగా, మరోచోట అమర్చిన భారీ మందుపాతరను పోలీసులు గుర్తించారు. ఇంతలోనే పీఎల్‌జీఏ వారోత్సవాలు మొదలు కానుండడంతో అప్రమత్తమైన పోలీసు శాఖ సరిహద్దు ప్రాంత గ్రామాల్లో భారీగా బలగాలను మోహరించింది.

అణువణువూ కూంబింగ్

సరిహద్దు గ్రామాలకు చేరుకున్న సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, కోబ్రా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అణువణువూ తనిఖీలు చేస్తూనే మావోయిస్టు పార్టీ సానుభూతిపరులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లను అదుపులోకి తీసుకుని మావోల కదలికలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. కాగా, వారోత్సవాల సందర్భంగానే మావోయిస్టు పార్టీ రిక్రూట్‌మెంట్లపై కూడా దృష్టి సారించినట్లు తెలిసింది. దీంతో సరిహద్దు ప్రాంతంలో వారు నిర్వహించే సభలకు ఏయే గ్రామాల నుంచి ఎవరెవరు వెళ్తున్నారనే విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అంతేకాక వారోత్సవాల నేపథ్యాన మావోయిస్టులు విధ్వంసాలకు దిగొచ్చన్న నిఘా వర్గాల సమాచారంతో సరిహద్దు ప్రాంత ఆదివాసీ గ్రామాలతో పాటు రూరల్ ప్రాంత గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ఆస్తుల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాటుచేశారు. అలాగే, రహదారులు, భవన నిర్మాణాలకు ఉపయోగించే యంత్ర పరికరాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల ముఖ్యులు, నాయకులను వారోత్సవాలు ముగిసేవరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇప్పటికే సూచనలు చేశారు. సరిహద్దు ప్రాంత మార్గాల్లో మోహరించిన పోలీసులు వచ్చివెళ్లే వాహనాలను తనిఖీ చేస్తూ అందులోని ప్రయాణికులు వివరాలు ఆరా తీస్తున్నారు. సరిహద్దు ప్రాంతంలో ఉన్న చెలిమెల, తిప్పాపురం, చెన్నాపురం, తోగ్గూడెం, ధర్మారం, వద్దిపేట, పూసుగుప్ప సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపులకు అదనపు బలగాలు ఇప్పటికే చేరుకోగా, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, కోబ్రా, గ్రేహౌండ్స్ బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేశారు. కాగా, సరిహద్దుకు భారీగా బలగాలు చేరుకుంటున్న నేపథ్యాన ఏక్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు.

ఆడుకుంటుండగా స్వరపేటికలోకి దిగిన స్ప్రింగ్

ఆపరేషన్ లేకుండానే తొలగించిన వైద్యుడు

ఖమ్మం వైద్యవిభాగం: బొమ్మ తుపాకీతో ఆడుకునే క్రమంలో అందులోని స్ప్రింగ్ మింగి ఓ బాలుడు ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. దీంతో వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా ఆపరేషన్ లేకుండానే చాకచక్యంగా స్వరపేటికలో ఇరుక్కున్న స్ప్రింగ్‌ను బయటకు తీయగా బాలుడి ప్రాణాలు దక్కాయి. సత్తుపల్లికి చెందిన రెండో తరగతి విద్యార్థి ప్రేమ్‌కుమార్(9) గురువారం ఇంటి వద్ద బొమ్మ తుపాకీతో ఆడుకున్నాడు. అందులోని పెద్ద స్ప్రింగ్‌ను నోట్లో పెట్టుకోగా గొంతులోకి వెళ్లింది. ఆ స్ప్రింగ్ స్వరపేటికలో కుచ్చుకొని శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి మాట కూడా ఆగిపోయింది. దీంతో ప్రేమ్ తల్లి సమీప ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు స్ప్రింగ్ తొలగించడం కష్టమని చెప్పారు. అనంతరం ఖమ్మం మయూరిసెంటర్‌లోని సాయిరాం గ్యాస్ట్రో, లివర్ హస్పిటల్‌కు బాలుడిని తీసుకురాగా డాక్టర్ జంగాల సునీల్‌కుమార్ పరీక్షించారు. ఈమేరకు అత్యాధునిక పీడియాట్రిక్ ఎండోస్కోపీ పరికరాన్ని ఉపయోగించి ఆపరేషన్ లేకుండా స్వరపేటిక, ఊపిరి గొట్టంలో ఇరుక్కుపోయిన స్ప్రింగ్ తొలగించగా బాలుడి బంధువులు వైద్యుడు సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


డాక్టర్ సునీల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న బాలుడు, తల్లి

స్వస్థలాలకు బయలుదేరిన పోలీసులు


ప్రత్యేక రైలులో భోపాల్ వెళ్తున్న మధ్యప్రదేశ్ పోలీసులు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బందోబస్తు కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మధ్యప్రదేశ్ నుంచి 1,200మంది పోలీసులు వచ్చారు. జిల్లాలో గురువారం పోలింగ్‌ముగియడంతో శుక్రవారం వారు తమ రాష్ట్రానికి బయలుదేరారు. పోలీసు బలగాల కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేక రైలును ఏర్పాటుచేయగా, అందులో ఖమ్మం స్టేషన్ నుంచి భోపాల్ వెళ్లారు. కాగా, ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించిన పోలీసులను ప్రత్యేక బస్సుల ద్వారా ఖమ్మం రైల్వే స్టేషన్‌కు చేరవేర్చారు. అక్కడ సీపీ విష్ణు ఎస్.వారియర్ ఆదేశాలతో భోజనం, ఇతర ఆహార పదార్థాలను అందజేశారు. ఖమ్మం వన్ టౌన్, త్రీ టౌన్ సీఐలు స్వామి, సత్యనారాయణ తదితరులు మధ్యప్రదేశ్ పోలీసులకు వీడ్కోలు పలికారు. అలాగే, కేంద్రసాయుధ బలగాలు, ఒడిశా, ఇతర జిల్లాల పోలీసులు సైతం వెళ్లిపోయారు.
– ఖమ్మంక్రైం


ఖమ్మం రైల్వేస్టేషన్‌కు వస్తున్న పోలీసులు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు


విద్యార్థి వరుణ్‌తేజ్

ములకలపల్లి: ఓ ఉపాధ్యాయుడు విద్యార్థిని చితకబాదిన విషయమై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన ఎలకం నగేష్, లక్ష్మి దంపతుల కుమారుడు వరుణ్‌తేజ్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. వరుణ్‌తేజ్ కొన్ని రోజులుగా పాఠశాలకు రావడం లేదు. కాగా, శుక్రవారం స్కూల్‌కు వచ్చిన వరుణ్‌తేజ్‌ను ఉపాధ్యాయుడు శ్యాంనాయక్ కర్రతో విచక్షణారహితంగా కొట్టాడు. విషయం తెలియడంతో కుటుంబీకులు స్కూల్‌కు చేరుకొని ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడినట్లు సమాచారం. దీంతో ఉపాధ్యాయుడు 100కు డయల్ చేశారు. హుటాహుటిన పాఠశాలకు చేరుకున్న ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి ఉపాధ్యాయుడు శ్యాంనాయక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, ఎస్ఐ మాట్లాడుతూ ఇరు పక్షాలు క్షణికావేశంలో పరస్పర దాడులకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని స్పష్టం చేశారు.

మిర్చితోటలోకి దూసుకెళ్లిన కారు


మిర్చి తోటలో ఉన్న కారు

తల్లాడ: మండలంలోని లక్ష్మీనగర్ గ్రామంలో శుక్రవారం మిర్చి తోటలోకి ఓ కారు దూసుకెళ్లింది. స్థానికుల కథనం ప్రకారం... ఏన్కూరు నుంచి తల్లాడ వైపు వెళ్తున్న కారు తెల్లవారుజామున మిర్చితోటలోకి దూసుకెళ్లింది. దీంతో కాపు దశలో ఉన్న మిర్చితోటకు నష్టం వాటిల్లిందని రైతు ఉపేందర్ తెలిపాడు. కాగా, మిర్చితోటలోకి దూసుకెళ్లిన కారు ఎవరిదనేది తెలియకపోగా, ఎవరు కూడా సాయంత్రం వరకు కారు వద్దకు రాలేదు.

ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- ఇక ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై దృష్టి

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఇక ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. అక్టోబర్ 10వ తేదీన శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా, ఆనాటి నుంచి అధికారులు సెలవులు లేకుండా విధులు నిర్వర్తించారు. ఈక్రమంలో గురువారం పోలింగ్ ముగియగా రాత్రివరకు స్ట్రాంగ్‌రూంలకు ఈవీఎంలు చేరాయి. ఇక ఆదివారం ఓట్ల లెక్కింపు విధులకు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి కొందరు ఉద్యోగులను కేటాయించారు. మిగతా వారు స్ట్రాంగ్‌రూంలో భద్రత, కౌంటింగ్ ప్రక్రియను కలెక్టరేట్ నుంచి పర్యవేక్షించనున్నారు.

కొద్దిగా రిలాక్స్...

సుమారు నెలన్నర పాటు ఎన్నికల విధుల్లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు శుక్రవారం కాస్త రిలాక్స్‌గా కనిపించారు. యథావిధిగా తమ శాఖ విధుల్లో నిమగ్నమయ్యారు. అయితే, ఎన్నికల విభాగం అధికారులు కౌంటింగ్ ఏర్పాట్లు, ఇతర పనులు చేస్తూ కనిపించారు. కాగా, నిత్యం సమీక్షలు, వచ్చివెళ్లే అధికారులతో ఇన్నాళ్లు కలెక్టరేట్‌లో హడావుడి ఉండగా, శుక్రవారం మాత్రం బోసిపోయి కనిపించింది.


విధుల్లో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు


కౌంటింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాల ఫుటేజీని కలెక్టరేట్‌లో పరిశీలిస్తున్న సిబ్బంది


ఖాళీగా కనిపిస్తున్న ఖమ్మం కలెక్టరేట్ ప్రాంగణం

‘ఐబీ’ అడుగులు

విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశా నిర్దేశం

- సర్కారు స్కూళ్లలో విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్.. పాఠ్య ప్రణాళికలో ఆర్థిక పాఠాలకు ప్రాధాన్యం
- అంతర్జాతీయంగా రాణించేలా విదేశీ భాషలు కూడా
- ‘ఐబీ’ బోధనా విధానాలపై వచ్చే ఏడాది టీచర్లకు ట్రైనింగ్
- 2025–26లో ఒకటో తరగతితో ఐబీ ప్రారంభించి.. ఆపై ఏటా ఒక్కో తరగతిలో దశలవారీగా అమల్లోకి

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించేందుకు అవసరమైన తర్ఫీదు స్కూళ్ల స్థాయి నుంచే అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. అందుకు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్ నేర్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) సిలబస్ అమలుకు సన్నద్ధం కావాలని, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఏపీ ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఐబీ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ప్రవేశపెట్టి ఆ తరువాత ఏడాది రెండో తరగతికి, ఆపై దశల వారీగా మిగతా తరగతులకు విస్తరించాలని సూచించారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని నిర్దేశించారు. ఈమేరకు విద్యాశాఖపై శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో సీఎం జగన్ పలు కీలక సూచనలు చేశారు. పాఠ్య ప్రణాళికలో ఆర్థిక పాఠాలను అంతర్భాగం చేయాలన్నారు. హైస్కూల్ స్థాయిలో ప్రతి తరగతిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ) అందుబాటులో ఉండాలన్నారు. టోఫెల్ అమలు



తీరు మరింత మెరుగ్గా ఉండాలని సూచించారు. దేశవ్యాప్తంగా సగటున 37.03 శాతం మంది ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో 84.11 శాతం మంది ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. మిగిలిన పిల్లలను కూడా ప్రోత్సహిస్తూ వంద శాతం ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాసేలా సిద్ధం చేయాలని సీఎం సూచించారు. నాడు–నేడు రెండో దశ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు.

10 రోజుల పాటు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం

- 17 నుంచి జనవరి 14 వరకు సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై సేవ
- టీటీడీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి కాషన్ డిపాజిట్ రిఫండ్ ట్రాకర్
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని డిసెంబర్ 23 నుంచి జనవరి 1 (10 రోజులు) వరకు కల్పించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తిరుపతి, తిరుమలలోని 10 కేంద్రాల్లో డిసెంబర్ 22 నుంచి 4,23,500 టోకెన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. తిరుపతిలోని ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణు నివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, శ్రీ గోవిందరాజస్వామి రెండో సత్రం, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లి, జీవకోనలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, తిరుమలలో స్థానికుల కోసం కౌస్తుభం విశ్రాంతి గృహం వద్ద టోకెన్లు ఇవ్వనున్నట్లు వివరించారు. టోకెన్లు ఉన్నవారిని మాత్రమే శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 22 నుంచి 24 వరకు, డిసెంబర్ 31, జనవరి 1న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను రద్దు చేసినట్లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 9–11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామిని స్వర్ణ రథంపై మాడ వీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. వైకుంఠ ద్వాదశి నాడు శ్రీవారికి ఉదయం 4.30 గంటలకు చక్రస్నానం నిర్వహిస్తామని చెప్పారు. ధనుర్మాసం సందర్భంగా ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై పఠనాన్ని నిర్వహిస్తామని చెప్పారు. తిరుమలలో గదులు పొందిన భక్తులు కాషన్ డిపాజిట్ స్థితిని తెలుసుకునేందుకు టీటీడీ వెబ్‌సైట్‌లో కాషన్ డిపాజిట్ రిఫండ్ ట్రాకర్‌ను పొందుపరిచినట్లు చెప్పారు.

శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను,అధికారులు ప్రసాదాలను అందజేశారు.



ఆలయం వెలుపల జస్టిస్ మండవ కిరణ్మయి

డాక్టర్ వైఎస్సార్ రంగస్థల పురస్కారాలు..

- డిసెంబర్ 10లోగా దరఖాస్తులు పంపాలి
- రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటకరంగ

సాక్షి, అమరావతి: ఈ ఏడాది నుంచి ‘డాక్టర్ వైఎస్సార్ రంగస్థల పురస్కారం’ పేరుతో నాటక సమాజాల ప్రోత్సాహానికి ఏటా ఓ అవార్డును అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ తుమ్మ విజయకుమార్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నాటక రంగంపై ఆసక్తిగల కళా ప్రియులకు వేదిక కల్పించి, ఆ రంగం వృద్ధికి గణనీయమైన కృషి చేసిన సమాజాలు, పరిషత్తులకు రూ. 5,00,000, వైఎస్సార్ ప్రతిమ మెమెంటోను ప్రభుత్వం అందజేయనుంది. నంది నాటకోత్సవాల సందర్భంగా అదే వేదికపై వ్యక్తిగత స్థాయిలో నాటక రంగంలో విశేష కృషి చేసిన నటులకు, కళాకారులకు ‘ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం’ పేరుతో అవార్డు ప్రదానం చేయనుంది. కాగా మొదటిసారి ఈ రంగంలో సమష్టి కృషితో (టీమ్‌వర్క్) పని చేసిన సమాజాలకు, పరిషత్తులకు గుర్తింపు లభించనుంది. ‘ఎన్టీఆర్, డాక్టర్ వైఎస్సార్ రంగస్థల పురస్కారాలకు’ అర్హులైన వ్యక్తులు, సమాజాలు, పరిషత్తులు ఆన్ లైన్ ద్వారా తమ దరఖాస్తులను డిసెంబర్ 10వ తేదీ లోగా పంపాలి. తగు ధృవ పత్రాలు జతచేసిన దరఖాస్తులు డిసెంబర్ 18వ తేదీలోగా మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ, ఆర్.టి.సి. కాంప్లెక్స్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, 4వ ఫ్లోర్, విజయవాడ–520013 చిరునామాకు చేరేట్టుగా పంపాలి.

కోస్తాంధ్రపై మిచాంగ్ తుపాను పడగ!

5న నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం

సాక్షి, విశాఖపట్నం/ సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను కోస్తాంధ్రపై పడగ విప్పనుంది. రాయలసీమలోనూ పెను ప్రభావం చూపనుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోంది. తుపాను ప్రభావిత జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది.

నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం శుక్రవారం రాత్రికి నెల్లూరుకు ఆగ్నేయంగా 790, బాపట్లకు దక్షిణ ఆగ్నేయంగా 860, మచిలీపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 850 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ శనివారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారనుంది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తుపానుగా బలపడుతుంది. ఆపై వాయవ్య దిశగా పయనిస్తూ ఈనెల 4వ తేదీకి దక్షిణ కోస్తాంధ్ర తీరానికి చేరుకుంటుంది. అనంతరం ఉత్తర దిశగా కదులుతూ ఐదో తేదీ ఉదయం నెల్లూరు – మచిలీపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న రెండు రోజులు గంటకు 50 నుంచి 60 కి.మీలు, తీరాన్ని దాటే సమయంలో గంటకు 80–90 కి.మీలు, గరిష్టంగా 100



తుపాను గమ్యాన్ని తెలిపే సైక్లోన్‌ట్రాక్

కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఈ తుపానుకు మయన్మార్ సూచించిన ‘మిచాంగ్’గా నామకరణం చేయనున్నారు.

భారీ నుంచి అతి భారీ వర్షాలు

తుపాను ప్రభావం శనివారం నుంచి మొదలై ఈ నెల ఐదో తేదీ వరకు కొనసాగనుంది. శనివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురవనున్నాయి. మూడో తేదీన పశ్చిమ గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, ఎస్పీఎస్సార్ నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. 4వ తేదీన పశ్చిమ గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఎస్పీఎస్సార్ నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, తిరుపతి జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, ఏలూరు, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అన్నమయ్య, చిత్తూరు, వైఎస్సార్, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురవవచ్చని తెలిపింది. తుపాను తీరాన్ని దాటే 5వ తేదీన పశ్చిమ గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఏలూరు జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుపాను నేపథ్యంలో తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్టేట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ప్రజలు అత్యవసర సహాయం, వాతావరణ సమాచారం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు 1070, 112, 18004250101లో సంప్రదించాలని తెలిపారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు, ప్రత్యేక రైళ్ల పొడిగింపు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్లను పూర్తిగాను, పాక్షికం గాను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 4 నుంచి 17వ తేదీ వరకు కాకినాడ పోర్టు–విశాఖపట్నం (17267/17268), మచిలీపట్నం–విశాఖపట్నం (17219/17220), ఈ నెల 5 నుంచి 18 వరకు గుంటూరు–రాయగడ (17243/17244), బిట్రగుంట–విజయవాడ (07977/07978), విజయవాడ–తెనాలి (07279/07575), విజయవాడ–ఒంగోలు (07461/07575), విజయవాడ–గూడూరు (07500), విజయవాడ–గూడూరు (12744), ఈ నెల 4, 5, 6, 8 తేదీలలో విజయవాడ–విశాఖపట్నం (22702), ఈ నెల 9, 11, 12, 13 తేదీలలో విశాఖపట్నం–విజయవాడ (22701), ఈ నెల 4 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు–విశాఖపట్నం (17239/17240), ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు విశాఖపట్నం–గుంటూరు (17240), ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు, అదే విధంగా ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు బిట్రగుంట–చెన్నై సెంట్రల్ (17237/17238), ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు గూడూరు–విజయవాడ (07458/12743) రైళ్లు పూర్తిగా రద్దు చేశారు. కాగా, మచిలీపట్నం– విజయవాడ, నర్సాపూర్–విజయవాడ, విజయవాడ–భీమవరం మధ్య రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వేర్వేరు ప్రాంతాల నుంచి నడుపుతున్న పలు రైళ్లను పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 4 నుంచి 25వ తేదీ వరకు పూర్ణా–తిరుపతి (07609), ఈ నెల 5 నుంచి 26వ తేదీ వరకు తిరుపతి–పూర్ణా (07610), ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్–నర్సాపూర్ (07631), ఈ నెల 3 నుంచి 31వ తేదీ వరకు నర్సాపూర్–హైదరాబాద్ (07632), ఈ నెల 3 నుంచి 31వ తేదీ వరకు తిరుపతి–సికింద్రాబాద్ (07481), ఈ నెల 4 నుంచి 25వ తేదీ వరకు సికింద్రాబాద్–తిరుపతి (07482), ఈ నెల 1 నుంచి 29వ తేదీ వరకు కాకినాడ టౌన్–లింగంపల్లి (07445), ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరకు లింగంపల్లి–కాకినాడ టౌన్ (07446) రైళ్లను పొడిగించారు.

జిల్లా వార్తలు

బొగ్గు ఉత్పత్తి 82 శాతం

సింగరేణి వ్యాప్తంగా నవంబర్‌లో ఉత్పత్తి ఇది..

- గడిచిన ఎనిమిది నెలల్లో 93 శాతంగా నమోదు
- వంద శాతం నాలుగు ఏరియాల్లోనే నమోదు..
- నాలుగు నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం



ఓసీలో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్న దృశ్యం

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఏడాది 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా.. ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది నెలలు ముగిశాయి. ఈ సమయంలో 46.32 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా, 43.18 మిలియన్ టన్నులు (93 శాతం) సాధించారు. దీంతో రానున్న నాలుగు నెలల్లో పూర్తిగా లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా, నవంబర్‌లో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని 24 భూగర్భ గనులు, 19 ఓపెన్ కాస్ట్ గనుల్లో 74.14 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 60.83 లక్షల టన్నుల (82 శాతం) ఉత్పత్తి నమోదైంది. ఈ నెలలో 24 భూగర్భ గనుల్లో 7,01,900 లక్షల టన్నులకు 5,56,113 టన్నులు (79 శాతం), 19 ఓపెన్‌కాస్ట్‌ల్లో 67,40,000 టన్నులకు గాను 55,27,637 టన్నులు (82 శాతం) ఉత్పత్తి నమోదైందని అధికారులు వెల్లడించారు.

నవంబర్‌లో బెల్లంపల్లి అగ్రస్థానం

సింగరేణి వ్యాప్త 11 ఏరియాల్లోని బెల్లంపల్లి నవంబర్‌లో 131 శాతం, గడిచిన ఎనిమిది మాసాల్లో 129 శాతం సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత అండ్రియాల ప్రాజెక్ట్ 132 శాతం, 107 శాతంతో రెండో, మణుగూరు ఏరియా మూడో స్థానంలో నిలిచాయి. ఇక ఆర్జీ–2 ఏరియా 103 శాతం, ఆర్జీ–2 102 శాతం, కొత్తగూడెం ఏరియా 72 శాతం, ఇల్లెందు ఏరియా 100, మందమర్రి ఏరియా 86 శాతం, శ్రీరాంపూర్ ఏరియా 78 శాతం, ఆర్జీ–1 ఏరియా 94 శాతం, భూపాలపల్లి ఏరియా 68 శాతం ఉత్పత్తి సాధించాయి.

గడచిన ఎనిమిది నెలల్లో ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి వివరాలు (టన్నుల్లో)

ఏరియా	నిర్దేశిత లక్ష్యం	సాధించిన ఉత్పత్తి	శాతం
ఇల్లెందు	20,23,000	25,25,246	125
బెల్లంపల్లి	19,00,000	24,57,439	129
మణుగూరు	75,46,700	89,93,292	119
కొత్తగూడెం	86,38,000	89,38,489	103
ఆర్జీ–3	33,40,000	33,22,504	99
ఆర్జీ–2	58,38,000	55,19,718	95
ఆర్జీ–1	28,40,400	26,52,760	93
మందమర్రి	29,37,500	25,53,449	87
శ్రీరాంపూర్	43,00,500	34,37,403	80
అండ్రియాల	11,64,800	8,49,037	73
భూపాలపల్లి	30,50,000	19,39,395	64
మొత్తం	4,63,28,900	4,31,88,732	93

ఎనిమిది మాసాల్లో నాలుగు ఏరియాలే

సంస్థ వ్యాప్తంగా 2023–24 సంవత్సరంలో 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనేది లక్ష్యం కాగా.. ప్రతీ ఏరియాకు కొంత లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే, 11 ఏరియాల్లో నాలుగు ఏరియాల్లో మాత్రం ఈ ఎనిమిది నెలల్లో వంద శాతానికి మించి ఉత్పత్తినమోదైంది. బెల్లంపల్లి ఏరియా 129 శాతం సాధించి అగ్రస్థానంలో నిలవగా, 125 శాతంతో ఇల్లెందు, 119 శాతంతో మణుగూరు, 103 శాతంతో కొత్తగూడెం ఏరియా ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఇక ఆర్జీ–3 99 శాతం, ఆర్జీ–2 ఏరియా 95 శాతం, ఆర్జీ–1 ఏరియా 93 శాతం, మందమర్రి ఏరియా 87 శాతం, శ్రీరాంపూర్ ఏరియా 80 శాతం, అండ్రియాల 73 శాతం, భూపాలపల్లి ఏరియా 64 శాతం మాత్రమే ఉత్పత్తి సాధించగలిగాయి.

కొత్తగూడెం రీజియన్‌లో..

కొత్తగూడెం రీజియన్ పరిధిలోని మూడు ఏరియాల్లో నవంబర్‌లో జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఇందులో కొత్తగూడెం ఏరియా 10,95,872, ఇల్లెందు ఏరియా 40,02,00, మణుగూరు ఏరియా 11,44,887 టన్నులు కలిపి మొత్తంగా 26,40,959 టన్నుల ఉత్పత్తి సాధించాయి.


అందరూ లక్ష్యసాధనకు కృషి చేయాలి



సింగరేణిలో 11 ఏరియాలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి సాధించాలి. ఇప్పటివరకు నాలుగు ఏరియాల్లోనే నెలవారీ లక్ష్య సాధన నమోదవుతోంది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు నాలుగు నెల సమయమే ఉన్నందున మిగతా ఏరియాల్లోనూ లక్ష్య సాధనపై అధికారులు, ఉద్యోగులు, కార్మికులు దృష్టి సారించాలి.
–ఎన్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ (పా)

11 నుంచి ఉర్సే షరీఫ్ ఉత్సవాలు

- సత్యనారాయణపురం నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాలో మొదలైన ఏర్పాట్లు
- కులమతాలకతీతంగా హాజరుకానున్న భక్తులు



దర్గాలో కొలువుదీరిన హజ్రత్ నాగుల్‌మీరా

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలం సత్యనారాయణపురం శివార్లలో కొలువుదీరిన హజ్రత్ నాగుల్ మీరా మౌలా చాన్ దర్గాలో ఈ నెల 11, 12వ తేదీల్లో జరిగే ఉర్సే షరీఫ్ ఉత్సవాలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ మేరకు ప్రచార పోస్టర్లను ఉత్సవ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఆవిష్కరించారు. నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాలో ఉర్సు ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు 21వ ఉర్సు ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దర్గా ప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేస్తున్నారు.

కార్తీక మాసం అమావాస్య రోజున..

21వ ఉర్సు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా కార్తీకమాసం అమావాస్య రోజున వేడుకలు జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. ఇల్లెందు పట్టణంలోని హజ్రత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్‌కు సత్యనారాయణపురం శివారు అటవీ ప్రాంతంలో కొలువుదీరిన హజ్రత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాహ్ అనుబంధంగా కొనసాగుతోంది. పట్టణంలోని దర్గా షరీఫ్ నుంచి ఉత్సవాలు ప్రారంభమై నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాలో ముగుస్తాయి. కాగా, పట్టణంలోని హజ్రత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్ నుంచి ఈ నెల 11వ తేదీన చాదర్‌ను, 12వ తేదీన సందల్‌ను ప్రత్యేక ఊరేగింపుతో నాగుల్‌మీరా దర్గాకు చేరుస్తారు. ఈ సందర్భంగా నిర్వహించే భారీ జులూష్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఉర్సు ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి కులమతాలకు అతీతంగా అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు.



ఉర్సు ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు

ఖమ్మంమామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం మరికొన్ని రోజులు అమల్లో ఉంటుందని ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే పలు రైళ్లను ఈ నెల 4వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించగా, పనులు పూర్తికాకపోవడంతో 17వ తేదీ వరకు రద్దు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ మేరకు డోర్నకల్ – విజయవాడ (07755), విజయవాడ – డోర్నకల్ (07756), భద్రాచలంరోడ్ – విజయవాడ (07278) విజయవాడ – భద్రాచలంరోడ్ (07279) ప్యాసింజర్ రైళ్లు ఈ నెల 17వ తేదీ వరకు నడవవనే విషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

‘ఇల్లెందు ఔన్నత్యాన్ని అభాసుపాలు చేశారు’

ఇల్లెందు: పోరాటాల పురిటి గడ్డ అయిన ఇల్లెందుకు ఒక చరిత్ర ఉండగా.. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఔన్నత్యాన్ని అభాసుపాలు చేశారని న్యూడెమోక్రసీ పార్టీల రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సాధినేని వెంకటేశ్వరరావు తెలిపారు. ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సి ఉండగా, బహిరంగంగా డబ్బు పంపిణీ చేసి ఈ గడ్డ కీర్తిని మంట కలిపారని పేర్కొన్నారు. ఫలితంగా ఎన్నికలు, ఓట్లు ఖరీదుగా మారాయని తెలిపారు. ప్రజలే తమకు డబ్బులు అందలేదని ఆందోళనలు చేసే స్థాయికి తీసుకొచ్చిన నాయకులు ఏ మేర అభివృద్ధి చేశారో గమనించాలని కోరారు. ఓటుకు ఒక్క రుపాయి ఇవ్వకుండా ఎన్నోసార్లు ఇల్లెందులో ఎన్నికలు జరిగాయని, ఇప్పుడు విచ్చలవిడిగా నగదు పంపిణీ చేసినా అధికారులు, పోలీసులు పట్టించుకోలేదని విమర్శించారు. అయితే, ఎవరు గెలిచినా ఎర్ర జెండా నీడన పోరాటాలు కొనసాగుతాయని, విజేతలు మేనిఫెస్టో అమలుచేసేలా ఉద్యమాలు చేపడుతామని మధు, వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో నాయకులు జె.సీతారామయ్య, మోకాళ్ల కృష్ణ, రాసుద్దీన్, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధు, సాధినేని

వేటకు వెళ్లి షాక్‌తో వ్యక్తి మృతి

కారేపల్లి: అడవి జంతువుల వేటకు వెళ్లిన వ్యక్తి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బాజుమల్లాయిగూడెంకు చెందిన దోమందుల సుధాకర్ (43) సహా నలుగురు గురువారం రాత్రి సమీపాన ఉన్న అడవికి జంతువుల వేటకు వెళ్లారు. అక్కడ సుబాబుల్ తోటలో అడవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తాకడంతో సుధాకర్ షాక్‌కు గురై మృతి చెందాడు. శుక్రవారం ఉదయం వరకు ఆయన రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సుబాబుల్ తోట సమీపాన ఉన్న రైతులు సుధాకర్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కారేపల్లి ఎస్ఐ పుష్పాల రామారావు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

బీటీపీఎస్ కీర్తి ప్రతిష్టలు పెంచాలి

మణుగూరురూరల్: క్రీడా, సాంస్కృతిక రంగాల్లోనూ ఉద్యోగులు ప్రతిభ కనబరుస్తూ భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలని సీఈ బి.బిచ్చన్న సూచించారు. ఇటీవల శ్రీశైలం ఎడమగట్టులో టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ ఉమెన్స్ గేమ్స్, కల్చరల్ ఈవెంట్ జరగగా, బీటీపీఎస్ నుంచి పాల్గొన్న ఉద్యోగ క్రీడాకారులు జానపద, విచిత్ర వేషధారణ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే, ఉత్తమ క్యారెక్టర్, కన్సోలేషన్ బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు శుక్రవారం సీఈ బిచ్చన్నను కలవగా ఆయన అభినందించి మాట్లాడారు. టీఎస్ జెన్‌కో నాణ్యమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలవడమే కాక క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడటంతో పాటు క్రీడా, కళారంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యదర్శి కల్తీ నర్సింహారావు, డీఈ భీమ్యా, సత్యనారాయణమూర్తి, క్రీడాకారులు ఎస్.హుస్సేన్, వి.శ్రీనివాసరావు, ఎస్.అంజె, కె.ధనలక్ష్మి, ఎస్.రమాదేవి, కె.సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులను అభినందిస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, అధికారులు